సాక్షి తిరుపతి

గురువారం । 2 । మే । 2024



టీడీపీ మేనిఫెస్టో బూటకం

టీడీపీ మేనిఫెస్టో అంతా బూటకమని, నమ్మి మోసపోవద్దని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, మేరిగ సూచించారు. - 8లో



నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. - 8లో



గురు సంక్రమణ ఉత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం గురు సంక్రమణ ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సేవలు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సేవలను ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నట్లు ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు తెలిపారు. గతంలో ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు నమోదు చేసుకోవడానికి ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ సేవలు అన్నీ ఆన్‌లైన్‌లో అభ్యర్థులు పొందవచ్చని తెలిపారు. httpr://employment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ ఎస్ఎంఎస్ ద్వారా పొందవచ్చని చెప్పారు. ఎంప్లాయ్‌మెంట్ కార్డును సైతం లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

చింతామోహన్‌ను నిలదీసిన చిల్లకూరు వాసులు

చిల్లకూరు: కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్‌ను చిల్లకూరు వాసులు నిలదీశారు. వివరాలు.. చిల్లకూరు దళితవాడకు చెందిన వేమయ్యకి ముందుగా గూడూరు అసెంబ్లీ టిక్కెట్టును ఖరారు చేసి నామినేషన్ వేసిన అనంతరం చింతామోహన్ రంగంలోకి దిగారు. కోటకు చెందిన డాక్టర్ రామక్రిష్ణకు బీఫారం ఇప్పించారు. ఈ క్రమంలో చింతామోహన్ బుధవారం కాంగ్రెస్ పార్టీ గూడూరు అభ్యర్థి రామక్రిష్ణతో కలసి చిల్లకూరులో ప్రచారం కోసం వచ్చారు. ముందుగా దళితవాడ వద్దకు వెళ్లడంతో అక్కడ ఉన్న వారు అతనిని నిలదీశారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తికి ముందుగా టిక్కెట్టు కేటాయించి.. ఆపై ఇంకొకరికి బీఫాం ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఇలాంటి వాళ్లు తమ దళితవాడలోకి ప్రచారానికి రావొద్దంటూ ఖరాకండీగా తేల్చిచెప్పారు. దీంతో చేసేది లేక చింతామోహన్ అక్కడి నుంచి వెనుదిరిగారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: భారత దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ అయిన స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓఎస్‌డీ గిరిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో (డీహెచ్ టీడీ) లెటరల్ ఎంట్రి హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ టెక్నాలజీ రెండు, మూడ సంవత్సరాల డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు జూన్ 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు www.iihtvgr.com వెబ్‌సైట్, 93999 36872 ,98661 69908,90102 43054 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

3న డయల్ యువర్ టీటీడీ ఈఓ

తిరుమల: డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఈనెల 3న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో జరుగనుంది. భక్తులు నేరుగా టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డితో ఫోన్ నంబర్ 0877–2263261 ద్వారా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తొలి రోజు 76.53 శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: సామాజిక భద్రత పింఛన్లు బుధవారం జిల్లాలో తొలిరోజు 76.53 శాతం పంపిణీ చేసినట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 2,70,394 మంది లబ్ధిదారులు ఉండగా.. అందులో డోర్‌డెలివరీ పింఛన్లు 69,522 ఉన్నట్టు తెలిపారు. తొలి రోజు 53,206 డోర్‌డెలివరీ చేసినట్టు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో 100శాతం అందిస్తామని చెప్పారు. మరోవైపు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిన పింఛన్లు బుధవారం మేడే సందర్భంగా బ్యాంక్‌లకు సెలవులు ఉండడంతో గురువారం తీసుకునే సౌకర్యాలను కల్పించామని చెప్పారు.

తాయిలాల ఎర.. ఓటర్లకు వల!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి అభ్యర్థులకు ఓటమి భయం వెంటాడుతోంది. ఎన్నికలు సమీపించే కొద్దీ వెన్నులో వణుకుపుడుతోంది. అందుకే ఎన్నికలకు మరో రెండు వారాలు గడువు ఉన్నా అప్పుడే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీ తాయిలాలతో సిద్ధమైపోయింది. కొందరు పట్టుచీరలు, నగదు పంపిణీ చేస్తుండగా.. మరికొందరు విందులు, పసందులతో ఓటర్లకు గాలం వేస్తున్నారు. ఇది చాలదన్నట్టు చిరు ఉద్యోగులకు వల వేసి ఎన్నికల రంగంలోకి దింపేందుకు కుయుక్తులు పన్నుతున్నారు.. అది ఎక్కడ.. ఏంటో మీరే చదవండి.

కోట్ల రూపాయలతో ఓట్ల కొనుగోలుకు స్కెచ్

- తిరుపతిలో మహిళా సంఘాల ఓట్లకు వల
- ఆర్పీలకు పట్టుచీర, రూ.25వేల నగదు?
- లీడర్లకు రూ.10వేలు, పట్టు చీర
- పంచుతూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ కూటమి నేతలు
- టీడీపీ, జనసేన నేతలతో కలిసి బీఎల్‌ఓల ఓటర్ల స్లిప్పుల పంపిణీ
- శ్రీకాళహస్తిలో టీడీపీ నేత భారీ ఎత్తున విందు భోజనం
- విందుకు హాజరైన స్థానికులు ఒక్కొక్కరికీ రూ.500 పంపిణీ

సాక్షి, తిరుపతి: ఓటమి భయంతో కూటమి నేతలు కోట్ల రూపాయలతో ఓటర్లను కొనుగోలు చేసేపనిలో నిమగ్నమయ్యారు. తిరుపతిలో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డ్వాక్రా సంఘ సభ్యులను లక్ష్యంగా చేసుకుని బుధవారం ఆర్పీల ద్వారా నగదు, చీరలు పంపిణీ చేపట్టారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 4,590 డ్వాక్రా సంఘాల్లో సుమారు 70వేల మందికిపైగా సభ్యులు ఉన్నారు. ఇందులో ఒక సంఘానికి ఒక లీడర్.. 25 నుంచి 30 సంఘాలకు ఒక ఆర్పీ (రిసోర్స్ పర్సన్) ఉంటారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రతి ఆర్పీకి రూ.10వేలు వేతనం చెల్లిస్తున్నారు. నగరంలో 70 వేల మంది సభ్యుల ఓట్ల కోసం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, టీడీపీ, జనసేన నేతల ద్వారా కొంత మంది ఆర్పీలను పిలిపించుకుని మంతనాలు నెరిపారు. వారం పది రోజులుగా సాగిన ఈ చర్చల్లో టీడీపీకి అనుకూలంగా ఉన్న ఓ పది మంది ఆర్పీలు మిగిలిన ఆర్పీలతో సంప్రదించారు. ఇందులో కొందరు ససేమిర అనగా.. మరికొందరు కూటమి నేతలు ఇచ్చే తాయిలాలకు ఆశపడి టీడీపీ సానుభూతి పరులైన ఆర్పీలు చెప్పిన నితిన్ అపార్ట్‌మెంట్‌కు బుధవారం ఉదయమే చేరుకున్నారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల పక్కనే ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లో ఆర్పీలు ఒక్కొక్కరికీ రూ.25వేలు, ఖరీదైన పట్టుచీరలు పంపిణీ చేశారు. భారీగా తాయిలాలు అందుకున్న కొందరు ఆర్పీలు మరికొందరు లీడర్లకు రూ.10వేలు, ఓ పట్టు చీర ఇచ్చి వారి ద్వారా సభ్యులను పిలిపించుకోవడం ప్రారంభించారు. ఇలా వచ్చిన వారికి ఖరీదైన చీరతో పాటు రూ.3వేల నగదు ఉన్న కవర్, అందులో కూటమి అభ్యర్థి బ్యాలెట్ పేపర్ ఇచ్చి పంపారు. ఆ అపార్ట్ మెంట్ మొదటి అంతస్తులో రహస్యంగా చేపట్టిన పంపిణీ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి పంపిణీ చేస్తున్న 45 పట్టు చీరలు, 35 కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో కవర్‌లో రూ.3 వేల నగదు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

బీఎల్‌ఓలూ.. ఇది తగునా..?

తిరుపతి నగరంలోని 14వ డివిజన్ ఎస్టీవీ నగర్‌లో టీడీపీ నేతలతో కలిసి బీఎల్‌ఓ స్లిప్పులు పంపిణీ చేస్తూపట్టుబడ్డారు. 147 పోలింగ్ బూత్‌కు చెందిన బీఎల్‌ఓ భారతి, ఆర్పీ లక్ష్మి టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వీరితో పాటు ఇలాంటి వారిపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నితిన్ అపార్ట్‌మెంట్ నుంచి తాయిలాలు తీసుకెళ్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు

మందైకూసిన కూటమి తాయిలాలు

సాధారణంగా టీడీపీ నేతలు ఎన్నికలకు ముందు రోజు రాత్రి ఓటర్లకు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తుంటారు. అయితే ఈ ఎన్నికల్లో కూటమి నేతలు రెండు వారాలకు ముందే మొదలెట్టేశారు. తిరుపతితో పాటు.. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, చిత్తూరు, గంగాధరనెల్లూరు, పలమనేరు, పూతలపట్టులోనూ కూటమి నేతలు రహస్యంగా తాయిలాలు పంపిణీ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. వైఎస్సార్‌సీపీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల మద్దతు ఉండడంతో పూతలపట్టులో కూటమి అభ్యర్థి తనకు ఎంపీ అభ్యర్థి ద్వారా వచ్చిన నగదును పంపిణీ చేయడం ప్రారంభించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఓటు బ్యాంకు ఉన్న నాయకులకు రూ.25వేల నుంచి రూ.లక్ష చొప్పున పంపిణీ చేసినట్లు పూతలపట్టులో జోరుగా ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా చిత్తూరులో నగదుతో పాటు ఖరీదైన బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. అది కూడా ఆయా కంపెనీ షోరూంల వద్దకు వెళ్లి అభ్యర్థి తరుపున ఇచ్చిన స్లిప్పులు తీసుకెళ్లి చూపిస్తే ఖరీదైన వస్తువులు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం కాళికామాత ఆలయ సమీపంలో పెద్ద ఎత్తున విందు భోజనాలు ఏర్పాటు చేశారు. 30 పొట్టేళ్లు, 200 కిలోల రొయ్యలు, మరో 250 కిలోల చికెన్‌తో భారీ విందు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు, ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అక్కడికి వచ్చినందుకు స్థానికులకు విందు భోజనంతో పాటు రూ.500 చొప్పున నగదు పంపిణీ చేసినట్లు సమాచారం. అదే విధంగా తటస్తంగా ఉన్న నాయకులకు స్థాయిని బట్టి ప్యాకేజీ ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అరాచకాలకు పెద్దన్న చంద్రబాబు

- చిన్నన్న పవన్‌కళ్యాణ్
- కార్పొరేటర్లను ప్రలోభ పెట్టేందుకు కూటమి యత్నం
- కార్పొరేటర్లంతా మా కుటుంబ సభ్యులు.. ప్రలోభాలకు లొంగరు
- జీవకోనలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీమూకలు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన





49వ డివిజన్‌లోని మహిళలకు భరోసా ఇస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష (ఇన్‌సెట్) ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే, మేయర్

తిరుపతి మంగళం: 'అవినీతి అరాచకాలకు పెద్దన్న చంద్రబాబు అయితే చిన్నన్న పవన్‌కళ్యాణ్. అరాచకశుక్తులంతా కూటమిగా ఏర్పడి తిరుపతిలో అల్లర్లు సృష్టిస్తున్నాయి. నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తిరుపతి ప్రజలంతా చిత్తూరు రౌడీయిజాన్ని ఆదరించకపోవడంతో సిగ్గులేకుండా మా కార్పొరేటర్లను ప్రలోభపెట్టేందుకు రాత్రుల్లో వారి ఇళ్లకు వెళ్లి రూ.కోట్లు ఇస్తామని కాళ్ల పట్టుకుంటున్నారు. కార్పొరేటర్లంతా మా కుటుంబ సభ్యులే. వీళ్ల ప్రలోభాలకు తలొగ్గే ప్రసక్తే లేదు...' అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన 34, 44, 49 డివిజన్లలో కార్పొరేటర్లు శ్రావణి మునిరామిరెడ్డి, వరికుంట్ల నారాయణ, 49వ డివిజన్ ఇన్‌చార్జ్ రెడ్డెప్పరెడ్డి ఆధ్వర్యంలో మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఆయనకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ తిరుపతిలో అరాచకశక్తులను తరిమి కొడదామని పిలుపునిచ్చారు. జీవకోనలో రౌడీయిజాన్ని ప్రదర్శిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఓటర్లను సైతం ఓట్లు వేయకపోతే చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జగనన్న అందించిన సంక్షేమం, తిరుపతిలో చేసిన అభివృద్ధికి తిరుపతి ప్రజలంతా అభినయ్‌కి మద్దతుగా ఉండడాన్ని జీర్ణించుకోలేకే అరాచకాలు, రౌడీయిజానికి పాల్పడుతున్నారన్నారు. కూటమి రౌడీయిజానికి నగర ప్రజలంతా ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, తలారి రాజేంద్ర, రమణమ్మ, ఆటో ప్రసాద్, గణేష్, కోటేశ్వరరావు, లోకనాథం, దినేష్, దుర్గ, పోలిరెడ్డి నాగిరెడ్డి, మునిరామిరెడ్డి, అశోక్‌రెడ్డి, యోగాంజనేయులు, నాదముని పాల్గొన్నారు.

మోసగాడు బాబు



బండారుపల్లి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ సిపాయి

ఏర్పేడు:ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మండలంలోని బండారుపల్లి, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిద్ధం ఎన్నికల ప్రచార కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసంచేయడానికి ప్రయత్నిస్తున్న టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు కావాలన్నారు. సీఎం జగనన్న ప్రజలకు చేయగలిగింది మాత్రమే చెబుతారన్నారు. కూటమి ప్రకటిస్తున్న హామీలు అమలు చేయడం సాధ్యం కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు జీవిత, మోహన్‌రెడ్డి, మునిరామయ్య, వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సామాజిక భద్రతా పింఛన్లు

- పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్



రామచంద్రాపురం మండలంలోని సి.రామాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: 'సామాజిక భద్రతా పింఛన్లు అందరికీ అందజేస్తాం.. ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదు' అని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట తదితర ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింఛన్ కోసం లబ్ధిదారులు ఎవ్వరూ సచివాలయానికి రావాల్సిన పనిలేదన్నారు. మే 1వ తేదీ మేడే సందర్భంగా బ్యాంక్ సెలవు నేపథ్యంలో 2వ తేదీ(గురువారం) నుంచి బ్యాంక్ ఖాతాల్లో పింఛన్ నగదు తీసుకోవచ్చన్నారు. వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం ఆయన తిరుపతి గ్రామీణ మండలం పరిధిలోని కేసీపేటలో, రామచంద్రాపురం మండలం, సి.రామాపురం గ్రామంలో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, మంచానికే పరిమితమైన వారికి చేస్తున్న పెన్షన్ పంపిణీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ గృహ సందర్శన ద్వారా విభిన్న ప్రతిభావంతుడు మహేష్‌కుమార్‌కి తన చేతుల మీదుగా పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం వడమాలపేట మండలం, పూడి గ్రామ పరిధిలో పెన్షన్ల పంపిణీని పరిశీలించారు. స్థానిక ఎంపీడీఓ మాట్లాడుతూ గృహ సందర్శన ద్వారా అందించాల్సిన పెన్షన్లు పూడి గ్రామ సచివాలయ పరిధిలో 142 ఉన్నాయని, అందులో 70 శాతం పూర్తి చేశామని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ మండలంలోని సచివాలయ సిబ్బంది పెన్షన్ లాగిన్ ఉన్నవారందరూ లాగిన్ అయ్యి పెన్షన్ల పంపిణీని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, తిరుపతి రూరల్, ఆర్సీపురం, వడమాలపేట ఎంపీడీఓలు రమేష్, ప్రత్యూష, సుజాత, డీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి @ 45

- నిప్పుల కొలిమిలా మారిన జిల్లా
- వడగాల్పులతో జనం ఉక్కిరి బిక్కిరి
- ఉదయం ఏడు నుంచే దంచేస్తున్న ఎండ
- సాయంత్రం 6 గంటల వరకు అదే పరిస్థితి



తిరుపతి తుడా: మండే ఎండలు అలజడిని సృష్టిస్తున్నాయి. ఉదయం 7 నుంచి ఎండలు భగభగలాడుతూ నిప్పులు చెరుగుతున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య తీవ్రమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడంలేదు. తీవ్ర ఉష్ణోగ్రతలతో తిరుపతి జిల్లా నిప్పుల కొలిమిలా మారుతోంది. మండే ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు . ఎండలకు తోడు వడగాల్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తిరుపతి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలలో రికార్డు స్థాయిలో బుధవారం అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 45 డిగ్రీల ఉష్ణోగ్రత మార్కు ఈ ఏడాది ఇప్పటికే నాలుగు సార్లు నమోదైంది. రాబోవు మరో 20 రోజుల వరకు ఎండలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఊపిరాడదు!

మండే ఎండలు, వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటి పూట జనం వీధిలోకి రావడానికి జంకుతున్నారు. సాయంత్రం ఎండ తగ్గుముఖం పట్టిందన్న ఆశలు ఆవిరి చేస్తున్నాయి. ఇక అప్పుడు మొదలైన ఉక్కపోత రాత్రి 11 గంటలు వరకు కొనసాగుతోంది. చిరు వ్యాపారులు, పాదాచారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎన్నికల ప్రచారంలో ఉన్న రాజకీయపార్టీల నాయకులకు ఎండ సవాలు విసురుతోంది. ఉదయం 10 గంటల లోపే ప్రచారాలను ముగించుకొంటున్నారు.

వేసవిలో మెరుగైన సేవలు



కంట్రోలర్ ఆవుల ప్రభాకర్‌యాదవ్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న కడప ఈడీ

తిరుపతి అర్బన్: వేసవి నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు విచ్చేసి ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరాతీశారు. బస్టాండ్‌లో అన్ని సౌకర్యాలను కల్పించాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డికి సూచించారు. ఈ ఏడాది మార్చిలో తిరుమలలో ఓ చిన్నారి అదృశ్యం అయిన సంఘటనకు సంబంధించి నిందితురాలు ఆచూకీని తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న కంట్రోలర్ ఆవుల ప్రభాకర్ యాదవ్ వెంటనే పోలీసులకు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈమేరకు ఆవుల ప్రభాకర్‌యాదవ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఏటీఎం రామచంద్రనాయుడు, అలిపిరి డీఎం హరిబాబు, ఆర్టీసీ ఉద్యోగులు సత్యనారాయణ, రమేష్‌కుమార్, చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా గురు సంక్రమణ ఉత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీగురుదక్షిణామూర్తికి బుధవారం ఆగమోక్తంగా గురు సంక్రమణ ఉత్సవం నిర్వహించారు. గురువు (బృహస్పతి) మేషరాశి నుంచి వృషభరాశికి ప్రవేశించిన సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు వేదపండితులు అంకురార్పణ, వాస్తుశాంతి, కలశస్థాపన, పూర్ణాహుతి, హోమం, నైవేద్యం, దీపారాధన నిర్వహించారు. అంతకుముందు గురుదక్షిణామూర్తికి విశేష పూజలు నిర్వహించారు.

బాబు ఏడి పింఛెన్!

- టీడీపీ ఫిర్యాదుతో పండుటాకుల బతుకులు అతలాకుతలం
- రెండు నెలలుగా ఇంటికి చేరని పింఛన్
- గత నెలలో సచివాలయాల చుట్టూ చక్కర్లు
- ఇప్పుడు బ్యాంకుల ముందు నిరీక్షణ
- బాబు మట్టికొట్టుకుపోతాడంటూ శాపనార్థాలు

పండుటాకులపై టీడీపీ అధినేత చంద్రబాబు పగబట్టాడు. వారు ఇంటిపట్టునే పింఛన్ తీసుకోవడం ఇష్టంలేక తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. అంతటితో ఆగక కోర్టు మెట్లు కూడా ఎక్కారు. తీరా ఇంటికే చేరుతున్న పింఛన్‌ను నవ్వుల పాలు చేశారు. గతంలో మాదిరిగా కార్యాలయాల చుట్టూ తిరిగేలా కష్టాలు సృష్టించారు. గత రెండు నెలలుగా ఇంటికి పింఛన్ రాకపోవడంతో అభాగ్యులు అల్లాడిపోతున్నారు. గత నెలలో సచివాలయం, ఇప్పుడు బ్యాంకులు చుట్టూ తిరగలేక ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారు. 'నిప్పుల వాన'లో నడుచుకుంటూ వెళ్లలేక ఆపసోపాలు పడుతున్నారు. 'మాపై కక్షగట్టి.. వలంటీర్లను దూరం చేసి వేడుక చూస్తున్నాడు'అని పలువురు శాపనార్థాలు పెడుతున్నారు. మట్టికొట్టుకు పోవడం ఖాయమని శపిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

ఎందుకు ఇలా చేస్తున్నారు?



వలంటీర్‌ల ద్వారా నేరుగా ఇంటికే ఒకటో తేదీన పింఛన్ ఇస్తుంటే కక్షగట్టిన చంద్రబాబు ఎందుకు ఇలా చేస్తున్నారో తెలియడం లేదు. ఇంటి వద్ద ఉండే ముసలోళ్లు, బ్యాంకులకు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే ఆటో ఖర్చులు ఎవరు ఇస్తారు..? నాకు గూడూరు బ్యాంకులో ఖాతా ఉంది. అందులో నా పింఛన్ డబ్బు వేశారని సచివాలయ సిబ్బంది చెప్పారు. 15 కి.మీ దూరంలోని గూడూరుకు వెళ్లాలంటే నాకు ఒకరు తోడు కావాలి. వారికి, నాకు ఇద్దరికీ కలిపి ఆటో ఖర్చులు వంద రూపాయలు కావాలి. మాకు వచ్చే పింఛన్ డబ్బు ఇలా ఖర్చైపోతుంది. చంద్రబాబు ముసలోళ్లను ఇలా ఇబ్బంది పెట్టడం ఎందుకో అర్థం కావడం లేదు. – అనపల్లి అన్నపూర్ణమ్మ (కమ్మవారిపాళెం, చిల్లకూరు మండలం)

మళ్లీ పాత కష్టాలే



నా వయస్సు 42 ఏళ్లు. నాకు చిన్నప్పుడే పక్షవాతం సోకి కాళ్లు, చేతులు పడిపోయాయి. మంచానికే మరిమితమయ్యాను. నా పరిస్థితి చూసి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. అప్పటి నుంచి మా అన్న నన్ను భుజంపై మోసుకెళ్లి పింఛన్ తీసిచ్చేవారు. కొన్ని సార్లు పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాళ్లం. చివరికి ఇంకో రోజు రమ్మనే వాళ్లు. అయితే గత నాలుగేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ల ద్వారా మాకు ఇంటి వద్దే పింఛన్ తెచ్చి ఇప్పించారు. మేము ఎక్కడికీ వెళ్లకుండా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ అందుకునేవాళ్లం. గత నెల నుంచి వలంటీర్లు రావడంలేదు. గత నెల మా అన్నను వెంటబెట్టుకొని సచివాలయానికి ఆటోలో వెళ్లి పింఛన్ తీసుకున్నా. ఈ నెలకు అదికూడా లేదు. టీడీపీ వాళ్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే మాకు ఇన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. మళ్లీ పాత కష్టాలు పడాల్సి వస్తోంది –భాస్కరన్, గోవర్ధనగిరి దళితవాడ, పిచ్చాటూరు మండలం

అయ్యా.. మేము సుఖపడితే చూడలేవా?



పేదల పట్ల అండగా ఉన్న మా మనవుడు జగన్ ప్రభుత్వం మాకు నెలనెలా పింఛన్ ఇంటికి పంపించేవారు. అలాంటిది చంద్రబాబు మాపై కక్ష గట్టి రెండు నెలల నుంచి పింఛన్ ఇంటికి రాకుండా చేశాడు. గత నెలలో లాగానే ఈ నెల మా పింఛన్ సచివాలయాల వద్ద ఇస్తారని కాళ్లీడ్చుకుంటూ వెళ్లాం. అక్కడ అధికారుల కోసం ఎదురు చూశాము. చివరకు ఈ నెల పింఛన్ బ్యాంక్‌లో వేస్తారని చెప్పడంతో మండు టెండలో 2 కి.మీ కాలినడకన తిరిగి వచ్చేశాం. మమ్మల్ని బాధపెడుతున్న చంద్రబాబుకు ఓటు ద్వారా బుద్ధి చెబుతాం.

– చింతల వీరాస్వామి, వృద్ధుడు, వాకాడు



పండుటాకుల ఎదురుచూపు

వలంటీర్ వ్యవస్థకు అలవాటు పడిన వృద్ధులు తెల్లవారగానే గడప వద్దకే పింఛన్ వస్తుందని ఆశగా ఎదురు చూశారు. కానీ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలపై వారికి అవగాహన లేకపోవడంతో కోట మేజర్ పంచాయతీలోని నార్త్ గిరిజన కాలనీ, కోటమ్మగుడి కాలనీలోని పలువురు వృద్ధులు ఉదయం 8గంటలకే సచివాలయం వద్దకు చేరుకున్నారు. పంచాయతీ సిబ్బంది వచ్చి ఇక్కడ ఎవరికీ పింఛన్లు ఇవ్వరని, బ్యాంక్‌లకు వెళ్లి తీసుకోవాలని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.

కోట సచివాలయం వద్ద పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

ఇబ్బంది పడుతున్నాం



గతంలో ఉదయం 6 గంటలకంతా వలంటీరు మా ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవాడు. రెండు నెలలుగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. బాత్‌రూమ్‌లో కాలుజారి కాలు విరగడంతో ఒంటరి మహిళ అయిన నేను ఇంట్లో నుంచి కదిలేపరిస్థితి లేదు. గత మూడు నెలలుగా ఇంట్లోనే బెడ్‌రెస్ట్‌లో ఉన్నాను. పోయిన నెల సచివాలయ సిబ్బందే ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చారు. ఈ నెల ఎలాగో తెలియడం లేదు. నాకు బ్యాక్ అకౌంట్ కూడా లేదు. మాత్రలకు డబ్బులు అయిపోయాయి. వలంటర్ ఉంటే డబ్బులు తెచ్చిచ్చేవాడు. ఈ రోజు మందులు కొనేదాన్ని. కానీ చంద్రబాబునాయుడు పింఛన్ రాకుండా చేశారు. – ఎల్లమ్మ, పానగల్

మా గోస్ట తగులుతుంది



ఠంచన్‌గా తెల్లవారుజామున మా ఇంటికి వచ్చి తలుపు తట్టి పింఛను ఇచేన్చవారు. వలంటీర్లు కరోనా కష్టకాలంలో మా ఇంట్లో వారు బయటకు వెళ్లకుండా ఉంటే ఆ సమయంలో వారే ఆదుకున్నారు. ఇప్పుడు చంద్రబాబు ఇంటికి పింఛన్ రాకుండా అడ్డుకుంటున్నాడు. మా బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మా గోస్ట చంద్రబాబు నాయుడుకు తప్పక తగులుతుంది. – మునస్వామి, కొత్తపేట

చంద్రబాబు వల్లే మాకు ఈ కష్టాలు



ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే తలుపు తట్టి వలంటీర్లు పింఛన్ ఇచ్చేవాళ్లు. ఎన్నికల పేరుతో వారు మా ఇంటికి రాకుండా చేశారు. పింఛన్‌తో పాటు నెలలో నాలుగైదు సార్లు వలంటీర్లు ఇంటికి వచ్చేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంతకుముందు నెలలో సచివాలయానికి వెళ్లి తీసుకున్నాను. ఇప్పుడు బ్యాంక్ అకౌంట్లో వేశారు. నాకు డబ్బులు తీసుకునే కార్డు కూడా లేదు. ఆటో ఖర్చు లేగాక ఎండలో బ్యాంకుకు వెళ్లి రావడం చాలా కష్టం. మాకు ఈ ఇబ్బందులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వల్లే. జగన్ మోహన్ రెడ్డి ఉంటే వలంటీర్లు ఇంటికి వచ్చి గౌరవంగా పింఛన్ అందిస్తారు.

– చంద్రమ్మ, శివజ్యోతినగర్, తిరుపతి

ఎలా నడిచి వెళ్లాలి దేవుడా?



ఈ నెల పింఛన్ బ్యాంకులో వేస్తారని తెలిసింది. నాకు బ్యాంక్ అకౌంటు లేదు. ఉన్నా నేను కదలలేని పరిస్థితిలో ఉన్నాను. అక్కడ వరకు ఎలా వెళ్లి తెచ్చుకోవాలి. ఇది వరకు ఒకటో తారీఖు వస్తుందంటే ఇంటికి పింఛన్ వస్తుందని నాకు ఎంతో సంతోషంగా ఉండేది. ఇప్పుడు పింఛన్ కష్టాలతో భయమేస్తోంది. మాకు ఇన్ని కష్టాలు తెచ్చిన చంద్రబాబుకు మా ఉసురు తప్పక తగులుతుంది.

– ఇన్నమాల పోలమ్మ, గొల్లపాళెం

చంద్రబాబు వల్లే బాధలు



మాకు నాలుగన్నరేళ్లు ఎలాంటి ఇబ్బందీ లేకుండా తెల్లవారుజాము కల్లా తలుపు తట్టి ఇంటికే పింఛను తెచ్చి ఇస్తున్నారు. వలంటీర్లు మా నుంచి ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా పనిచేశారు. అయితే వలంటీర్లపై కక్ష గట్టి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నిమ్మగడ్డ ప్రసాద్ కోర్టులో కేసులు వేసి, వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల కమిషన్ వలంటీర్ల సేవలను నిలిపివేయడంతో రెండు నెలల నుంచి మేము పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. పింఛన్లపై కూడా రాజకీయం చేసే వ్యక్తి రేపు అధికారంలోకి వస్తే రూ.4 వేలు పింఛను ఇస్తానంటే ఎట్లా నమ్మాలి?. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి పింఛన్లను నేరుగా ఇంటికే పంపించి ఇవ్వాలన్న ఆలోచన ఏనాడూ చేయలేదు. – చెంగ్రాయులు, వృద్ధాప్య పింఛనుదారుడు, వెదుళ్లచెరువు, రేణిగుంట మండలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సూచించారు. బుధవారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రస్తుత స్థితిగతులను సంబంధిత ఎస్‌హెచ్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే కంటే ముందు పాటించాల్సిన 72 గంటల ముందస్తు ప్రణాళిక, 48 గంటల ముందస్తు ప్రణాళిక, 24 గంటల ముందస్తు ప్రణాళికలపై ప్రతి ఒక్కరూ సిద్ధం చేసుకుని ఆ ప్రణాళిక మేరకు శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. 5 నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, విమల కుమారి, శివరామిరెడ్డి, తిరుమల, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు



శ్రీకాళహస్తి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రాపూరు: తాతిపల్లిలో నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జిల్లాలో వైఎస్సార్‌సీపీ మంచి జోష్ మీద ఉంది. అభ్యర్థులు ప్రచార హోరులో మునిగితేలుతున్నారు. ఈ క్రమంలో పలువురు కూటమి నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఇందులో భాగంగానే శ్రీకాళహస్తి మండలం, విశాలాక్షినగర్, పెంకులపాడుకు చెందిన 13 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుండువాల కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేణిగుంటలో 200 మంది టీడీపీ సానుభూతిపరుల చేరిక

రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని జ్యోతినగర్, తిమ్మయ్యగుంట తదితర ప్రాంతాలకు చెందిన చెందిన 200మంది టీడీపీ సానుభూతిపరులు మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యులు సీ.తిరుమలరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రసూల్, సర్పంచ్ నగేషం, ఆవుల మునివెంకట్రామిరెడ్డి, నెమళ్ల పార్థసారథి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, ఖదీర్, రఫీ పాల్గొన్నారు.

నేదురుమల్లి సమక్షంలో 30 కుటుంబాలు చేరిక

రాపూరు: మండలంలోని తాతిపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన 30 కుంటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొండూరు ప్రసాద్, శంకరనారాయణ, కేశవులు, భాస్కర్, వెంకటనారాయణ ఉన్నారు.

చేనిగుంటలో టీడీపీ, బీజేపీకి షాక్

తడ: మండలంలోని చేనిగుంట పంచాయతీకి చెందిన కామిరెడ్డి యుగంధర్‌రెడ్డి, కామిరెడ్డి బాబురెడ్డి బుధవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో పార్టీలో చేరారు. వారితోపాటు నలుగురు వార్డు సభ్యులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కిలివేటి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



రేణిగుంట: కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రణధీరపురంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రణధీర్‌పురంలో వైఎస్సార్‌సీపీ జోష్

తిరుపతి రూరల్: తిరుపతి అర్బన్ మండలం, రణధీర్పురం పంచాయతీలో కూటమికి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఏకంగా 120 మంది టీడీపీ, జనసేనకు చెందిన కూటమి శ్రేణులు తుమ్మలగుంట నివాసం వద్ద బుధవారం తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సుందరం, కుమారి, వలేష, సుకుమారి, లక్ష్మి, ధనమ్మ, స్వాతి, సావిత్రి, కాంతమ్మ, సుమతి, రాములమ్మ, విమలమ్మ, రేవతి, శోభ, పుష్పమ్మ, వెల్లెమ్మ, షణ్ముగం, ప్రేమ్‌మార్, ప్రవీణ్, క్రాంతి, రెడ్డెమ్మ, లక్ష్మి, షాషిన, రాములమ్మ, దేవి, కుప్పమ్మ, హేమ, రేఖ, అనిల్, సుమతి, రెడ్డెమ్మ, చిన్నయ్య, వీరయ్య తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తుంటి సుధాయాదవ్, రాఘవ, సీహెచ్ చేవులు, ప్రసాద్‌బాబు, మాధవ, వరల్ బాషా, నాగరాజ, మణిరాయల్, ఢిల్లీ ప్రసాద్, మురగ, రాజేష్ పాల్గొన్నారు.



రేణిగుంట: వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



తడ: ఎమెల్యే కిలివేటికి మద్దతుగా యుగంధర్‌రెడ్డి, బాబురెడ్డి

టీడీపీ మేనిఫెస్టో బూటకం

- నమ్మి ఓటేస్తే నిలువునా ముంచుతాడు
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, మేరిగ మురళీధర్ ధ్వజం
- చిట్టమూరు మండలంలో విస్తృత ప్రచారం



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, మురళీధర్

చిట్టమూరు (చిల్లకూరు): 'టీడీపీ రంగుల కలలా ప్రజలకు చూపించిన మేనిఫెస్టో ఒక భూటకం.. దాన్ని నమ్మి ఓటేస్తే చంద్రబాబు నిలువునా ముంచడం ఖాయం..' అని తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ స్పష్టం చేశారు. బుధవారం చిట్టమూరు మండలంలోని ఎల్లసిరి, మన్నెమాల, ఈశ్వరవాక, ఆలేటిపాడు, చిట్టమూరు, పిట్టివానిపల్లి, ముక్కిడిపాళెం, వల్లంపర్తి, మల్లాం గ్రామాల్లో వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు భారీ జగమాలలు, హారతులతో ఆత్మీయంగా స్వాగతం పలికారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు దువ్వూరు శేషురెడ్డి, నాయకులు రాజీవ్‌రెడ్డి, రవిరెడ్డి, కస్తూర్‌రెడ్డి, అశ్విన్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.